
సమావేశంలో మాట్లాడుతున్న దాస్యం వినయ్ భాస్కర్

## క్రీడల్లో గెలుపోటములు సహజం

- విజేతలకు 24న కేటీఆర్ సమక్షంలో బహుమతుల ప్రదానం
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయభాస్కర్

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 16 : క్రీడల్లో గెలుపోటములు సహజమని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల గ్రౌండ్‌లో కేసీఆర్ జన్మదినం సందర్భంగా కాకతీయ క్రికెట్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీల ముగింపు కార్యక్రమానికి హాజరై గెలుపొందిన జట్లకు బహుమతులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడ పట్ల యువత ఆసక్తిని పెంచుకోవాలని సూచించారు. నియోజకవర్గంలోని 26 డివిజన్ల నుంచి 26 టీమ్‌లు పాల్గొన్నాయని, విన్నర్‌గా 47వ డివిజన్, రన్నర్‌గా 58వ డివిజన్ నిలిచిందన్నారు. ఈ జట్లకు 24న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేతుల మీదుగా బహుమతులను అందిస్తామని తెలిపారు. కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవ రెడ్డి, మైనారిటీ కమిషన్ సభ్యుడు దర్శన్‌సింగ్, పశ్చిమ నియోజవర్గ కో-ఆర్డినేటర్ పులి రజినీకాంత్ పాల్గొన్నారు.


ఈవీఎంల తనిఖీ ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

## ఈవీఎంల మొదటి దశ తనిఖీ పూర్తి

కాశీబుగ్గ, ఫిబ్రవరి 16: వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డులోని గోదాముల్లో ఈ నెల 5 నుంచి చేపట్టిన ఈవీఎంల తనిఖీ ప్రక్రియ మొదటి దశ పూర్తయినట్లు వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. అనంతరం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈసీఐఎల్ ఇంజినీర్ల ఆధ్వర్యంలో మాక్ పోలింగ్ నిర్వహించారు. కలెక్టర్ మాక్ పోలింగ్‌ను పరిశీలించి ఆర్డీవో వాసుచంద్రను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మాక్ పోలింగ్‌లో నిష్పత్తి ప్రకారం 500 ఓట్లకు 20 ఈవీఎంలు, వెయ్యి ఓట్లకు 20 ఈవీఎంలు, 1200 ఓట్లకు 12 ఈవీఎంలు.. మొత్తంగా మాక్ పోలింగ్‌లో 52 ఈవీఎంలను వినియోగించారు. వరంగల్ జిల్లాకు సంబంధించి వరంగల్ తూర్పు, వర్ధన్నపేట, నర్సంపేట, వరంగల్ పశ్చిమ నియోజకవర్గాల్లోని ఎఫ్ఎల్‌సీ ప్రక్రియలో 1848 బ్యాలెట్ యూనిట్లు, 1019 కంట్రోల్ యూనిట్లు, 1212 వీవీ ప్యాట్స్‌ను ఈసీఐఎల్ ఇంజినీర్లు ధ్రువీకరించారు.

## అంబర్ కోసం ఘర్షణ.. ఒకరి మృతి

నర్సంపేట రూరల్, ఫిబ్రవరి 16: అంబర్ కోసం ఇద్దరు ఘర్షణ పడగా ఒకరి ప్రాణం పోయిన ఘటన నర్సంపేటలోని ద్వారకపేటలో గురువారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. ద్వారకపేటకు చెందిన ఒగ్గుల రాజు(37), ఇదే గ్రామానికి చెందిన ముత్యం ప్రశాంత్ ఈ నెల 14న తమ మేస్త్రీ రవి ఇంటికి విందుకు వెళ్లారు. అనంతరం తనకు అంబర్ కావాలని ప్రశాంత్ అక్కడే ఉన్న రాజును అడిగాడు. ఈ విషయంలో ఇద్దరి మధ్య మాటామాట పెరిగి ఘర్షణ చోటు చేసుకున్నది. ఈ క్రమంలో రాజు కడుపులో ప్రశాంత్ పిడిగుద్దులు గుద్దాడు. దీంతో ఈ నెల 15న అర్ధరాత్రి ఒగ్గుల రాజు మృతి చెందాడు. శుక్రవారం మృతుడి భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శీలం రవి తెలిపారు.

## రెండు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన మాజీ సైనికుడు

నడికూడ, ఫిబ్రవరి 16 : మండలంలోని పులిగిల్ల గ్రామానికి చెందిన మాజీ సైనికుడు బిట్ల వేణుగోపాల్ పోలీస్(సివిల్), గ్రూప్-4 పరీక్షలు రాసి రెండింటిలో ఉద్యోగాలు సాధించాడు. 2003లో ఆర్మీలో చేరి లక్నోలో ట్రైనింగ్ పొంది గ్వాలియర్, రాజస్థాన్, పంజాబ్, జమ్మూకశ్మీర్, హైదరాబాద్, నాగాలాండ్‌లో 17సంవత్సరాలు విధులు నిర్వర్తించాడు. 2020లో ఆర్మీలో ఉద్యోగ విరమణ పొందాడు. ఇప్పుడు రెండు ప్రభుత్వ ఉద్యోగాలను సాధించాడు.


వేణుగోపాల్

# జాతర పనులు వేగవంతం చేయాలి

- భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి
- అగ్రంపహాడ్ వన దేవతలను దర్శించుకున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

ఆత్మకూరు, ఫిబ్రవరి 16 : అగ్రంపహాడ్ సమ్మక్క-సారలమ్మ జాతరలో జరుగుతున్న పనులు వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం అగ్రంపహాడ్ గ్రామంలోని నర్సరీని పరిశీలించారు. అనంతరం జాతర జరిగే ప్రాంతాన్ని సందర్శించారు. పార్కింగ్ స్థలాలను పరిశీలించారు. వన దేవతలకు మొక్కులు సమర్పించుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జాతరలో అక్కడక్కడ మిగిలిపోయిన పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. ప్లాస్టిక్ వాడకం పూర్తిగా నిషేధించాలన్నారు. జాతరలో రహదారులపై సైన్ బోర్డ్సు ఏర్పాటు చేయాలని ఎండోమెంట్ అధికారులను ఆదేశించారు. పూజారులు అమ్మవార్ల తీర్థ ప్రసాదాన్ని కలెక్టర్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాస్, ఏసీపీ కిశోర్‌కుమార్, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ జగన్‌మోహన్‌రెడ్డి, సీఐ సంతోష్, ఈవో శేషగిరి, పంచాయతీరాజ్ డీఈ వేణుగోపాల్, ఏఈ రవికుమార్, ఎండోమెంట్ జూనియర్ అసిస్టెంట్ గోపు శ్రీనివాస్, ఏపీవో రాజిరెడ్డి, జీపీ కార్యదర్శి బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.

### రుణాలు అందించి ఆర్థికాభివృద్ధికి తోడ్పడాలి..

హనుమకొండ చౌరస్తా : ప్రజలకు రుణాలను అందించి ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు అందించాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. కలెక్టరేట్‌లో బ్యాంకర్లు, అధికారులతో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. పశు సంవర్ధక శాఖ, మత్స్యశాఖ అధికారులు రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డులు, రుణాలను ఇవ్వాలని ఆదేశించారు. లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. 28 బ్యాంకులు 163 శాఖల ద్వారా ఈ ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించుకున్న వార్షిక రుణ ప్రణాళిక రూ.4826 .41 కోట్లకు మూడో త్రైమాసికంలో రూ.8078.11 కోట్లు రుణం మంజూరు చేశామన్నారు. జీవన జ్యోతి బీమా కింద 67,862 మందికి, సురక్ష బీమా ద్వారా 2,41,756 ఖాతాదారులకు బీమా సౌకర్యం, అటల్ పెన్షన్ ద్వారా సుమారు 49,890 మందికి పెన్షన్ సౌకర్యం కల్పించామన్నారు. ముద్ర యోజన ద్వారా 15,756 మంది చిరు వ్యాపారులకు రుణం మంజూరు చేసినట్లు తెలిపారు. నాబార్డ్ ఏజీఎం రవి, ఆర్‌బీఐ అధికారి రహమాన్, డీఆర్డీవో నాగ పద్మజ , ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మాధవీలత, బీసీ వెల్ఫేర్ డీడీ రామ్ రెడ్డి, జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీ వెంకటనారాయణ, మెప్మా పీడీ భద్రు నాయక్, అగ్రికల్చర్ ఏడీ దామోదర్ రెడ్డి పాల్గొన్నారు.


అమ్మవార్లను దర్శించుకుంటున్న జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

### పల్స్‌పోలియోను విజయవంతం చేయాలి..

ఈ నెల 20న జరుగనున్న జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ అన్నారు. కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలోని 2,33,500 మంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలను వేయడానికి ఏర్పాట్లు చేయాలన్నారు. ఫిబ్రవరి 20న వేయించకుంటే 27న వేసేలా ఏర్పాట్లు చేయనున్నట్లు మార్చి 3న 79,227 మంది చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో డీఆర్వో గణేశ్, డీఈవో అబ్దుల్ హై, అడిషనల్ డీఎంహెచ్‌వో మదన్ మోహన్‌రావు, డిప్యూటీ డీఎంహెచ్‌వో యాకూబ్ పాషా, డీఐవో వాణిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## టీఎన్జీవోస్ నిరసన

ఖిలా వరంగల్, ఫిబ్రవరి 16: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ వరంగల్ టీఎన్జీవోస్ కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు గజ్జెల రాంకిషన్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఉద్యోగుల పట్ల వ్యవహరిస్తున్న తీరు సరియైనది కాదన్నారు. కొత్త సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత విధానాన్ని అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గాజె వేణుగోపాల్, పాలకుర్తి సదానందం, జగదీశ్వర్, మురళీధర్‌రెడ్డి, రాజు, దుర్గారావు, ఇంద్రసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 'కోర్టులో హాజరు పర్చాలి'

కాశీబుగ్గ, ఫిబ్రవరి 16: న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి అశోక్, జిల్లా కార్యదర్శి గోపన్నను వెంటనే కోర్టులో హాజరు పర్చాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం కాశీబుగ్గ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో ఆరెల్లి కృష్ణ, రాచర్ల బాలరాజు, గంగుల దయాకర్, బండి కోటేశ్వరరావు, బన్న నర్సింగం, జన్నారం రాజేందర్, గద్దల ప్రభాకర్, రాజు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## పిల్లల కిడ్నాప్ కోసం వచ్చారని..

పోచమ్మమైదాన్, ఫిబ్రవరి 16: పిల్లలను కిడ్నాప్ చేయడానికి వచ్చారన్న అనుమానంతో దంపతులను నిలదీసిన ఘటన ఎంజీఎం దవాఖానలోని పిల్లల వార్డులో జరిగింది. మట్టెవాడ సీఐ తుమ్మ గోపి కథనం ప్రకారం.. ములుగు జిల్లా పాలంపేటకు చెందిన మాట్ల శ్రీను, స్వప్న దంపతులు హనుమకొండ పెద్దమ్మగడ్డలో నివాసముంటున్నారు. భార్యాభర్తలు గొడవ పడడంతో ఇద్దరికి గాయాలు అయ్యాయి. వారు గురువారం ఎంజీఎం దవాఖానలో ఓపీ సేవల కోసం వచ్చారు. ఈక్రమంలో పిల్లల వార్డులో ఉన్న తన బావమరిది కోసం శ్రీను వెతుకుతున్నాడు. ఈ సమయంలో కొందరు అటెండెంట్లు ఆ దంపతులను అనుమానించి నిలదీశారు. అనంతరం పోలీసులకు సమాచారం ఇచ్చారు. శుక్రవారం వారిని విచారించగా చికిత్స కోసం వచ్చారని, అతడి బావమరిది కూడా బొల్లికుంటకు చెందిన వ్యక్తిగా గుర్తించామని సీఐ తెలిపారు.

## వరంగల్‌కు చేరిన అయోధ్య రైలు

ఖిలా వరంగల్, ఫిబ్రవరి 16: శ్రీరాం దర్శన్ అభియాన్‌లో భాగంగా ఏర్పాటు చేసిన అయోధ్య ప్రత్యేక రైలు శుక్రవారం వరంగల్‌కు చేరుకుంది. వరంగల్ నుంచి సుమారు వేయి మంది భక్తులు తరలివెళ్లారు. దీంతో వరంగల్ రైల్వేస్టేషన్ కిక్కిరిసిపోయింది.

## విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికావొద్దు

### వరంగల్ డీఈవో వాసంతి

పోచమ్మమైదాన్, ఫిబ్రవరి 16: పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఎలాంటి మానసిక ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాయాలని వరంగల్ డీఈవో వాసంతి సూచించారు. టెన్త్ పరీక్షలు రాసే విద్యార్థులకు దేశాయిపేటలోని లక్ష్మీ గార్డెన్స్‌లో శుక్రవారం అన్ని సబ్జెక్టులపై ఆమె అవగాహన కల్పించారు. ట్రస్మా అధ్యక్షుడు చల్లా నాగార్జునరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో ప్రోగ్రాం కన్వీనర్ గుమ్మడవెల్లి సురేశ్, జనరల్ సెక్రటరీ బాశెట్టి వెంకటేశ్వర్లు, కోశాధికారి రామ్మూర్తి, వంగల రాధాకృష్ణ, నాసం సూర్యనారాయణ, బొల్లం కనకయ్య, రాంపల్లి రవి, సుధీర్, విద్యాసాగర్, సుధాకర్, సంజీవ, ఖలీల్, మాధవి, అశోక్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## సమగ్ర సమాచారంతో బడ్జెట్ రూపొందించాలి

### మేయర్ గుండు సుధారాణి


మాట్లాడుతున్న మేయర్ గుండు సుధారాణి

వరంగల్, ఫిబ్రవరి 16 : సమగ్ర సమాచారంతో బల్దియా బడ్జెట్‌ను రూపొందించాలని మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కార్పొరేషన్‌లో సమావేశం నిర్వహించారు. అదనపు కమిషనర్ అనీసుర్ రషీద్ బల్దియా ఆర్థిక అంశాలను మేయర్‌కు వివరించారు. సమావేశంలో ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, సీఎంహెచ్‌వో రాజేశ్, డిప్యూటీ కమిషనర్లు రవీందర్, కృష్ణారెడ్డి, హెచ్‌వో రమేశ్, ఈఈలు శ్రీనివాసరావు, బీఎల్ శ్రీనివాస్, సంజయ్‌కుమార్ పాల్గొన్నారు.

## తల్లిదండ్రులకు బాలిక అప్పగింత

గిర్మాజీపేట, ఫిబ్రవరి 16: మానసికస్థితి సరిగా లేని బాలికను శుక్రవారం ఇంతెజార్‌గంజ్ పీఎస్‌లో తల్లిదండ్రులకు ఏసీపీ బోనాల కిషన్, సీఐ ఎల్ పవన్‌కుమార్, మదర్ థెరిసా ఆశ్రమ సభ్యులు అప్పగించారు. ఏసీపీ కిషన్ కథనం ప్రకారం.. రెండున్నర ఏండ్ల క్రితం నందిని విజయవాడ రైల్వేస్టేషన్‌లో ఒంటరిగా తిరుగుతుండగా చేరదీసి అక్కడ ఆశ్రయం కల్పించారు. ఏడాదిన్నర క్రితం కాశీబుగ్గలోని మిషనరీస్ ఆఫ్ చారిటీ మదర్ థెరిసా ఆశ్రమానికి తీసుకొచ్చారు. నందిని మహారాష్ట్రలోని నందుర్బార్ జిల్లాకు చెందిన బాలికగా గుర్తించి వివరాలు పంపించారు. నందిని తల్లి మీరాబాయి, తండ్రి నరేశ్ గైక్వాడ్‌కు బాలికను అప్పగించినట్లు వివరించారు.

## 'పేటెంట్స్‌తో విస్తృత ఉపాధి'

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 16 : పేటెంట్స్‌తో విస్తృత ఉపాధి అవకాశాలు ఉన్నాయని కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి అన్నారు. నోడల్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్' మూడో అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. హైదరాబాద్ ఆశ్లాండ్ పేటెంట్స్ స్పెషలిస్ట్ డైరెక్టర్లు కిరణ్, సురేశ్‌బాబు మాట్లాడుతూ.. పేటెంట్స్, జీవితానికి ఉన్న సంబంధం, పేటెంట్స్ వల్ల కలిగే లాభాలను వివరించారు.

## 'హ్యూమన్ రైట్స్' జిల్లా చైర్మన్‌గా ఇబ్రహీం

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 16 : హ్యూమన్ రైట్స్ ఇంటర్నేషనల్ ఫెడరేషన్ హనుమకొండ జిల్లా చైర్మన్‌గా మహ్మద్ ఇబ్రహీం నియమితులయ్యారు. ఈ మేరకు నేషనల్ ప్రెసిడెంట్ నరేందర్ అరోరా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి సహకరించిన వారికి ఇబ్రహీం కృతజ్ఞతలు తెలిపారు.

## సీఐల బాధ్యతల స్వీకరణ

కాజీపేట/నయీంనగర్, ఫిబ్రవరి 16 : కాజీపేట సీఐగా సుధాకర్‌రెడ్డి శుక్రవారం రాత్రి బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న సార్ల రాజును సీపీ అంబర్ కిశోర్ ఝా ఐజీకి అటాచ్ చేశారు. అలాగే కేయూ ఎస్‌హెచ్‌వోగా చేరాలు విధుల్లో చేరారు.

## నిట్‌లో క్రీడా పోటీలు

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 16 : ప్రతి విద్యార్థి ఆరోగ్యంగా ఉండేందుకు క్రీడలకు కొంత సమయం కేటాయించాలని అంతర్జాతీయ అథ్లెట్, అర్జున అవార్డు గ్రహీత జోసెఫ్ జీ అబ్రహం అన్నారు. నిట్‌లో అథ్లెటిక్స్, ఖోఖో టోర్నమెంట్ ప్రారంభమైంది. జోసెఫ్ జీ అబ్రహం, నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి, డీన్ స్టూడెంట్ వెల్ఫేర్, స్పోర్ట్స్ ఆఫీసర్ శ్రీనివాసాచార్య, నిట్ కాలికట్ పరిశీలకుడు ధనేశ్ పోటీలను ప్రారంభించారు. నిట్ డైరెక్టర్ మాట్లాడుతూ.. ఈ టోర్నీలో 20 ఎన్ఐటీల నుంచి 800 మంది విద్యార్థులు పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాధిపతి దయానిధి పాల్గొన్నారు.

## బదిలీల్లో పాక్షిక మార్పులు

ఖిలా వరంగల్, ఫిబ్రవరి 16: రాష్ట్రవ్యాప్తంగా స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లను బదిలీ చేస్తూ గతంలో ఇచ్చిన ఉత్తర్వుల్లో పాక్షిక మార్పులు చేసింది. కే ఆది లక్ష్మికి బదులు వరంగల్ అదనపు కలెక్టర్‌గా గట్టు సంధ్యారాణిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే, రాష్ట్ర పవర్‌లూమ్, టెక్స్‌టైల్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కానుగుల శ్రీనివాస్‌ను వరంగల్ జిల్లా రెవెన్యూ అధికారిగా బదిలీ చేసినట్లు ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## పుస్తకాలు మార్గదర్శకాలు

సంగెం, ఫిబ్రవరి 16 : భవిష్యత్ తరాలకు పుస్తకాలు ఎంతో ఉపయోగపడతాయని ఆచార్య బన్న అయిలయ్య అన్నారు. సంగెం ఎంపీటీసీ మెట్టుపల్లి మల్లయ్య రచించిన మెట్టుపల్లి చైతన్యగీతాల పుస్తకాన్ని శుక్రవారం సంగెం రైతువేదికలో ఆవిష్కరించారు. ఎంపీపీ కళావతి, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

## అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్ క్రీడల్లో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 16 : ఆర్మీ బాయ్స్ స్పోర్ట్స్ కంపెనీ సెంటర్లో అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్ క్రీడల్లో శిక్షణ పొందడానికి అర్హులైన క్రీడాకారుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా యువజన క్రీడల అధికారి హనుమకొండ జిల్లా గుగులోత్ అశోక్‌కుమార్ నాయక్ తెలిపారు. ఈ నెల 21వ తేదీ నుంచి 27వరకు సెలక్షన్స్ నిర్వహిస్తారన్నారు. మూడో తరగతి పాసై 8 నుంచి 14 సంవత్సరాల మధ్య వయసున్న బాలురు జనన, కుల, విద్యాభ్యాస, నివాస ధ్రువీకరణ పత్రం, 10 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో హాజరు కావాలన్నారు. పూర్తి వివరాలకు 7016209016, 9393447721 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

## డంపింగ్‌యార్డును తరలించాలి : కడియం

మడికొండ, ఫిబ్రవరి 16: మడికొండ, రాంపూర్ మధ్యలో ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డుతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అసెంబ్లీలో ప్రస్తావించారు. మడిపల్లి, జయగిరి మధ్యలో డంపింగ్ యార్డు ఏర్పాటు కోసం 150 ఎకరాల స్థలాన్ని కేటాయించినట్లు తెలిపారు. ఈ యార్డు వల్ల భూగర్భ జలాలు కలుషితమై తాగు, సాగునీటికి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తున్నదని, వెంటనే డంపింగ్ యార్డును మార్చాలని కోరారు. అలాగే, స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గానికి మంజూరైన సైనిక్‌స్కూల్‌ను అక్కడే ఏర్పాటు చేయాలన్నారు.

## దూరవిద్య డిగ్రీ, పీజీ కోర్సుల ఫీజు గడువు మార్చి 15

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 16 : కేయూ దూరవిద్యా కేంద్రం అందిస్తున్న డిగ్రీ ద్వితీయ, తృతీయతో పాటు పీజీ కోర్సుల ఫీజు, పరీక్ష ఫీజును మార్చి 15 వరకు చెల్లించాలని డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం తెలిపారు. ఫీజులు చెల్లించి స్టడీ మెటీరియల్ పొందాలన్నారు. ఇతర వివరాలకు 0870-2461480, 2461490లో సంప్రదించాలన్నారు. ఎంఏ, ఎంకామ్, ఎంఎస్సీ మొదటి ఏడాది పూర్తయిన అభ్యర్థులందరూ రెండో ఏడాదికి కోర్సు టర్మ్ ఫీజులను అపరాధ రుసుము లేకుండా మార్చి 15 వరకు చెల్లించుకోవాలన్నారు.

## 25 వరకు మైనార్టీ స్కూల్, కాలేజీల్లో ప్రవేశాలు

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 16 : మైనార్టీ గురుకుల పాఠశాల, కాలేజీల్లో ప్రవేశాలకు దరఖాస్తుల గడువును ఈ నెల 25 వరకు పొడిగించినట్లు జిల్లా అధికారి మీన శ్రీను తెలిపారు. 5, 6, 7, 8వ (మైనార్టీ, బ్యాక్‌లాగ్ ఖాళీలు) తరగతిలో, ఇంటర్మీడియట్‌లో చేరాలనుకునే విద్యార్థులు తమ వివరాలను www.tmreis.telangana.gov.inలో నమోదు చేసుకోవాలని కోరారు.

## అమ్మవారిపేట జాతరకు ఏర్పాట్లు చేయాలి

### బల్దియా ఇన్‌చార్జి కమిషనర్ రాధికా గుప్తా

వరంగల్, ఫిబ్రవరి 16 : అమ్మవారిపేట సమ్మక్క-సారలమ్మ జాతరకు విస్తృత ఏర్పాట్లు చేయాలని బల్దియా ఇన్‌చార్జి కమిషనర్ రాధికా గుప్తా అధికారులను ఆదేశించారు. శుక్రవారం అమ్మవారిపేట జాతర ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ నెల 21వ తేదీ నుంచి జాతర ప్రారంభమవుతున్న తరుణంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ జలగం అనిత, అదనపు కలెక్టర్ మహేందర్ జీ, బల్దియా అదనపు కమిషనర్ అనీసుర్ రషీద్, ఆర్డీవో రమేశ్, సీఎంహెచ్‌వో రాజేశ్, డిప్యూటీ కమిషనర్ రవీందర్, తహసీల్దార్ బాపుసింగ్, ఈఈ సంజయ్‌కుమార్ పాల్గొన్నారు.

## 17, 18న 'ఘంటసాల' సంగీత కార్యక్రమం

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 16 : ఈ నెల 17, 18న అంబేద్కర్ ఆడిటోరియంలో సంగీత కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రవికుమార్ తెలిపారు. వివరాలకు 9030741972, 8919814168 నంబర్లలో సంప్రదించాలని కోరారు.


పూజా సామగ్రి తీసుకొస్తున్న భాస్కర్‌రావు, వనజ దంపతులు

## కోదండ రామాలయ వార్షిక బ్రహ్మోత్సవాలు

భీమదేవరపల్లి, ఫిబ్రవరి 16 : మండలంలోని గట్లనర్సింగాపూర్ గ్రామంలో శుక్రవారం కోదండ రామాలయ 8వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. కార్యక్రమానికి కావేరీ సీడ్స్ అధినేత గుండవరం వనజ-వెంకట భాస్కర్ రావు దంపతులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కావేరీ సీడ్స్ ప్రొడక్షన్ మేనేజర్ పామెర సుమన్‌రావు పాల్గొన్నారు.

## తల్లుల సేవలో బల్దియా కార్మికులు

### 19న మేడారం జాతరకు 500 మంది కార్మికులు

వరంగల్, ఫిబ్రవరి 16 : మేడారం సమ్మక్క-సారలమ్మ తల్లుల సేవకు బల్దియా పారిశుధ్య కార్మికులు వెళ్లనున్నారు. ఈ నెల 19న 500 మందిని పంపించేందుకు బల్దియా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. వారం పాటు వారు మేడారం మహా జాతరలో పారిశుధ్య సేవలు అందించనున్నారు. అలాగే 25 స్వచ్ఛ ఆటోలను జాతరకు పంపిస్తున్నారు. 50 మంది జవాన్లు, నలుగురు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, నలుగురు హెల్త్ ఇన్‌స్పెక్టర్లు, ఇద్దరు శానిటరీ సూపర్‌వైజర్లు, హెల్త్ సూపర్‌వైజర్ జాతరలో విధులు నిర్వర్తించనున్నారు. నాలుగు రోజుల క్రితం సీఎంహెచ్‌వో రాజేశ్ మేడారంలో కార్మికులకు వసతి ఏర్పాట్లను పరిశీలించారు.

## జల్సాలకు అలవాటు పడి దొంగతనాలు

### ఇద్దరిని పట్టుకున్న పోలీసులు ● బంగారు ఆభరణాలు, నగదు స్వాధీనం

పోచమ్మమైదాన్, ఫిబ్రవరి 16: రాత్రి వేళల్లో ఇంటి తాళాలు పగులగొట్టి చోరీలకు పాల్పడుతున్న ఇద్దరిని వరంగల్ సీసీఎస్, సుబేదారి పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుంచి రూ. 5,10,000 విలువైన బంగారు ఆభరణాలు, నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు శుక్రవారం వరంగల్ క్రైం పోలీసులు వివరాలు వెల్లడించారు. హనుమకొండ సుబేదారిలోని ప్రగతినగర్, రామకృష్ణకాలనీకి చెందిన దుర్గాప్రసాద్(కూలీ), దర్గా కాజీపేట హనుమాన్ కాలనీకి చెందిన వలపదాసు సాయి దత్తాత్రేయ (ఆటో డ్రైవర్) గంజాయి, మద్యానికి బానిసలయ్యారు. జల్సాల కోసం రాత్రి వేళల్లో ఇండ్ల తాళాలు పగులగొట్టి దొంగతనాలు చేస్తున్నారు. దుర్గాప్రసాద్ 2022లో బైక్ దొంగిలించి హనుమకొండ పోలీసులకు పట్టుపడ్డాడు. తర్వాత గంజాయి తాగే క్రమంలో దుర్గాప్రసాద్‌కు సాయి దత్తాత్రేయతో పరిచయం ఏర్పడింది. వీరిద్దరు తాళాలు వేసి ఉన్న ఇండ్లను టార్గెట్ చేసి దొంగతనాలు చేస్తున్నారు. ఈ నెల 10న వీరు అర్ధరాత్రి సమయంలో ఓ ఇంట్లో దొంగతనం చేశారు. ఈ చోరీపై సుబేదారి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ క్రమంలో గురువారం రాత్రి సుబేదారి ప్రాంతంలో పోలీసులు వాహన తనిఖీలు చేపట్టగా, వీరిద్దరూ బైక్‌పై పారిపోతుండగా పట్టుకున్నారు. వీరి నుంచి 70.430 గ్రాముల బంగారు ఆభరణాలు, రెండు సెల్‌ఫోన్లు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. దొంగలను పట్టుకోవడంలో ప్రతిభ చూపిన సిబ్బందిని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా అభినందించారు.

## నేడు తాగునీటి సరఫరా బంద్

వరంగల్, ఫిబ్రవరి 16 : కాశీబుగ్గ పరిధిలోని ఎరుకల వాడ వాటర్ ట్యాంక్‌లో గేట్ వాల్వ్ అవుట్‌లెట్ మరమ్మతులు కొనసాగుతున్నాయి. వివేకాంద కాలనీ ఫేజ్ 1,2,20వ డివిజన్ పరిధిలోని పద్మానగర్, శాంతినగర్, చెరువు కట్ట ప్రాంతాల్లో తాగునీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈ సారంగం ఒక ప్రకటనలో తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

REAL ESTATE

PLOT FOR SALE



★మీ పిల్లల బంగారు భవిష్యత్తు కొరకు 2 వేలకు 1గజం భూమి, యాదగిరిగుట్ట దగ్గర @ ఆలేరు, జీడికల్లు రామాలయ, ప్రసిద్ధ శివాలయం దగ్గర్లో, స్పాట్ రిజి. 100% వాస్తు. Cont: 9030769178.
NTW-00

★హయత్ నగర్, పెద్ద అంబర్‌పేట్, కోహెడ, బాటసింగారం, శ్రీమిత్ర, జనచైతన్య, మౌంట్ ఒపేర, గ్రీన్ సిటీ, సుచిరిండియాలో ప్లాట్లు కొనబడును. నో Brokrs. 9553973999 / 6303049720.
NT-313892

WANTED

jobs Apply Now!

★హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. Ph: 9640468899 / 9640258899.
NT-319440

CHANGE OF NAME

★I, VEERAIAH BOLLIKONDA (Old Name), S/o. BOLLIKONDA GANGAIAH, R/o. H.No. 2-8-294/A, Raghavendra Nagar, Phase-II, NGO's Colony, Waddepally, Hanumakonda Dist., T.S., I have changed my name as VEERENDAR BOLLIKONDA (New name), S/o. BOLLIKONDA GANGAIAH, as per Aadhar Card.
NTW-00

CHANGE OF NAME

★MALAY MAHESH, S/o. Ramaliingaiah, R/o. 2-5-90, Near Railway Station, Mahabubabad-506 101. Changed My Name as MALE MAHESH.
NT-96594

★PASUPPULETI NAVEEN KUMAR, S/o. Yadhagiri, R/o. 4-4-83, Sai Mandir Road, Mahabubabad- 506101. Changed My Name as PASUPULETI NAVEEN KUMAR.
NT-96594

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే

ప్రకటనల విభాగం : 9182777552

HANAMKONDA
9182777563
9182777618
9182777213

WARANAGAL
9182777556
9182777557
9182777558

JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777554
JANGAON - 9182777565

# మోదీ ప్రభుత్వంపై కార్మికుల కన్నెర్ర

- రెండు జిల్లాలో ధర్నాలు, ర్యాలీలు
- పాల్గొన్న వామపక్ష నాయకులు
- బంద్ విజయవంతం

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్ : కేంద్ర ప్రభుత్వ కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక పాలనను నిరసిస్తూ హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో వామపక్షాల నాయకులు ధర్నాలు, ర్యాలీలు తీశారు. కాజీపేట పట్టణంలో కార్మిక సంఘాల కిసాన్ సంయుక్త మోర్చా ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జక్కు రాజుగౌడ్ ఆధ్వర్యంలో ఆటో కార్మికులు కమలాపూర్ బస్టాండ్ నుంచి పనిగట్ల వరకు ర్యాలీ చేపట్టి రాష్ట్ర ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. హెచ్‌పీ గ్యాస్ ప్లాంట్ వద్ద కార్మికుల చట్టాలను రద్దు చేయాలని నిరసన తెలిపారు. నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ, ఏఐఎస్‌బీ, ఏఐఎఫ్‌డీస్, ఏఐడీఎస్‌వో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఎంజీఎం దవాఖాన సెంటర్‌లో మానవహారం, ధర్నా నిర్వహించారు. నాయకులు శరత్, ప్రశాంత్, అర్జున్ అరవింద్ మాట్లాడుతూ.. చరిత్రను వక్రీకరించే ఎన్‌సీఈఆర్టీ సిలబస్ మార్పులను ఆపాలన్నారు. సీఐటీయూ గ్రేటర్ కార్యదర్శి ఉప్పలయ్య ఆధ్వర్యంలో పలు విభాగాల కార్మికులు బల్దియా కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అలాగే సంగెం, గీసుగొండ, పరకాల మండలాల్లో నిరసన ప్రదర్శనలు చేపట్టారు.

### రైతు, కార్మిక వ్యతిరేక చట్టాలను ఉపసంహరించాలి

నర్సంపేటలో బీఆర్‌టీయూ, సీఐటీయూ, ఏఐటీయూసీ, ఏఐఎఫ్‌టీయూ (న్యూ), ఐఎఫ్‌టీయూ, రైతు సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో వరంగల్ రోడ్డు కూడలి నుంచి పాకాల రోడ్డు వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. రైతు, కార్మిక వ్యతిరేక చట్టాలను వెంటనే ఉపసంహరించాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఈసంపెల్లి బాబు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రధానమంత్రి మోదీ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. అలాగే, వర్ధన్నపేటలో కేంద్రం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కార్మిక సంఘాల ప్రతినిధులు నిరసన ర్యాలీ నిర్వహించారు. నెక్కొండలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు చాగంటి వెంకటయ్య, గ్రామ పంచాయతీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చాగంటి వెంకటయ్య ఆధ్వర్యంలో చేపట్టిన కార్మిక సమ్మె, గ్రామీణ బంద్ విజయవంతమైంది. ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు. దేశవ్యాప్త సమ్మెలో భాగంగా ఐనవోలులోని తహసీల్దార్ కార్యాలయం నుంచి తెలంగాణ తల్లి సెంటర్ వరకు తెలంగాణ రైతు సంఘం, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, కేవీపీఎస్, వృత్తిదారుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. సీపీఎం మండల కార్యదర్శి కే లింగయ్య మద్దతు తెలిపారు. వరంగల్ ట్రైసిటీలో చేపట్టిన ఆటో ల బంద్ విజయవంతమైనట్లు తెలంగాణ ఆటోడ్రైవర్స్ యూనియన్ నాయకులు, సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు ఈసంపెల్లి సంజీవ, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మడికొండ బాబు, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కలకోట్ల జయరాం, పసునూరి బాబు, బొల్లం సంజీవ, అమీర్, ఈశ్వర్, రవీందర్, యాకూబ్ పాషా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించి ఆటో కార్మికుల జీవితాలను రోడ్డున పడేసిందని ధ్వజమెత్తారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో సుమారు 56 వేల మంది ఆటో కార్మికుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే, తెలంగాణ రాష్ట్ర లారీ ఓనర్స్ అసోసియేషన్ బంద్‌కు పూర్తి మద్దతునిచ్చింది. లారీలను కార్యాలయంలోని పార్కింగ్‌లోనే నిలిపివేసి నిరసన తెలిపారు. అధ్యక్షుడు గోరెమియా, ఉపాధ్యక్షుడు సుదాటి రాజు, కార్యదర్శి ఎర్రబెల్లి భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు. ఏఐఎఫ్‌టీయూ(న్యూ) మండల అధ్యక్షుడు లింగన్న ఆధ్వర్యంలో ఖానాపురంలో ర్యాలీ నిర్వహించారు. పర్వతగిరిలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు.


గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు